13

# విముక్తి

అడుగులు, అడుగులు....

ఒకరి అడుగుల్లో మరొకరి అడుగులు. ముందు పాదం లేచిన చోటే వెనక పాదం. వెనక పాదం లేచిన చోటే ఆ వెనక పాదం. ఒక పద్ధతీ ఒక విభజనా లేకుండా మనుషుల అడుగులు. అడుగుల వెనక అడుగులు. పాదాల వెనక పాదాలు.... కాళ్ళ వెనక కాళ్ళు. మనిషి వెనక మనిషి. ఒక మొదలు లేదు. ఒక చివర లేదు. ప్రదక్షిణ. ప్రదక్షిణే- రచ్చబండ ఒక వ్యవస్థకు సంకేతం.

ఊరి నడిబొడ్డు- రచ్చబండ.

చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, వందలూ, వేల పాదాలు. కండరాలు నలిగిన పాదాలు. అడుగు తీసి అడుగేయలేని పాదాలు, రక్తనాళాలు పైకి తేలిన పాదాలు. అరిగిన మట్టెలున్న పాదాలు. యువరక్తం పారుతున్న పాదాలు. కొత్త మట్టెల్లో మెరిసిపోయే పాదాలు. చెప్పుల్లేని పాదాలు. అరిగిన చెప్పులున్న పాదాలు. కాయలుగాచిన పాదాలు. కిర్రుచెప్పుల పాదాలు. కష్టం తెలియని సుకుమారమైన పాదాలు. కేవలం పొలాల్లో తిరిగే పాదాలు. అప్పుడెప్పుడో పట్నం కూడా తిరిగిగొచ్చిన పాదాలు. నున్నటి పాదాలు. మెత్తని పాదాలు. చలికి పగిలిన పాదాలు. ఎండ తగలని పాదాలు. అప్పుడప్పుడు ఎండలో కాచ్చే పాదాలు. అసలు పుట్టినప్పటి నుండి చాటుతెలియని పాదాలు. బురదలో పన్జేసే మట్టిపాదాలు. నాగరికత నేర్చిన అకుచెప్పుల పాదాలు. పట్టాగొలుసులు, కడియాలతో బరువెక్కిన పాదాలు. వాటి

వెనకే కృషిలో రక్తంవోడ్చిన పాదాలు. జీవితపు దారిలో ఎన్నిముళ్లు గుచ్చుకున్నా, ఎన్ని కాయలు కాచినా లెక్కచేయని పాదాలు.

మోకాళ్ళపైదాకా చెక్కిన చీరెలు, ముతక ధోవతులు చిట్టి లాగులు- బుడ్డగోసులు- అంగీల్లేని మగశరీరాలు. చిరిగిన నెత్తి రుమాళ్ళు. అక్కడక్కడ అందమైన శుభ్రమైన గుడ్డలు.

ప్రదక్షిణచేస్తున్న మనుషులు. తల ల్లేవని మనుషులు. చేతు లెత్తని మనుషులు. నేలచూపులుతప్ప, చూడని మనుషులు. ప్రాణాలు బిగబట్టుకున్న మనుషులు. ఊపిరి, ఊపిరిపీల్చడానిక్కూడా ఊపిరి లేని మనుషులు. పీల్చింది వదిలేందుకు భయపడే మనుషులు.

కాళ్ళు కదులుతున్నాయి. ఒక్కొక్కరూ జరుగుతున్నారు. గంటలు, రోజులు, వారాలు జరుగుతున్నాయి.

అసహనంతో, అసహ్యంతో, అశక్తతతో, అధైర్యంతో వాళ్లు జరుగుతున్నారు.

వారాలూ, నెలలూ, సంవత్సరాలు, శతాబ్దాలు జరుగు తున్నాయి.

తల్లులు, తండ్రులు, తాతలు, తాతమ్మలు, మనవలు, మనవరాండ్రు, ముని మనవలు జరుగుతున్నారు.

అయినా ఆ పద్ధతిలోంచి. ఆ తిరుగుడులోంచి, ఆ బానిస విధా నంలోంచి, బయటపడి స్వేచ్ఛలోకి పోదామని వుంది. దాదాపు అందరికీ-

*　　*　　*

కొన్ని కళ్ళు చుట్టూ తిరగడం మొదలెట్టాయి. తల తిప్ప కుండానే పరిసరాల్ని చదవడం మొదలెట్టాయి. చేతులెత్తకుండానే వేళ్ళు సౌంజ్ఞలు చేసుకున్నాయి-

ఫలితంగా అదే గాడిలో పడబోయే రెండడుగులు బయట పడ్డాయి.

మరో చోటునుండి మరో రెండడుగులు బయటపడ్డాయి. ఆ పరిధి తప్పించి నాలుగు, ఎనమిది, పదహారు, ముప్పైరెండు, అరవై నాలుగు. నూటఇరవై ఎనిమిది...., అలాగే యింకా యింకా అడుగుల ప్రవాహం పెరిగిపోయింది.

కాళ్ళన్నీ కట్టగట్టుకుని పోతున్నట్టు- అడుగుల శబ్దంమాత్రమే వినిపిస్తోంది.

అడుగుల ప్రవాహాన్ని పెడదార్లు పట్టించే అనకట్టలాగా- అధికార రాజకీయం పన్జేస్తోంది. కుతంత్రాలు పన్జేస్తున్నాయి. అదృశ్య హస్తాలు పన్జేస్తునాయి. ఏదీ కనిపించదు. ఏదీ వినిపించదు.

—టకటకా అడుగులు ఆగిపోతున్న శబ్దం.

వేడి ఆవిర్లు వదిలేస్తూ బ్రేకులమీద నిలబడ్డ రైలింజన్ దృశ్యం!

స్థిరత్వాన్ని ఇష్టపడని కాళ్ళు అసహనంతో అటూయిటూ పరుగెడుతున్నాయి. తుపాకి చప్పుళ్ళు, రక్తపాతాలూ లేవు. కాని ప్రాణాలు రాలుతున్నాయి. శవాలు కూలుతున్నాయి. గానుగ నడక విడిచి బయటపడ్డ వాళ్ళ గుండెలు కొట్టుకొంటున్నాయి. అయినా వాళ్లాగడం లేదు. మృత్యువుకు భయపడడం లేదు.

—'దేశమంతా ప్రశాంతంగానే వుంది'- ప్రభుత్వం వార్తలు చదువుతున్న దృశ్యం.

కుప్పలు కుప్పలుగా గాయపడ్డ వాళ్లూ, చచ్చిపోయిన వాళ్లూ, మృత్యు నిశ్శబ్దం.

—నిశ్శబ్దంగా శవాల్ని పూడుస్తున్న దృశ్యం.

—ఉధృతమైన గాలికి మహావృక్షాలు నిలువునా కూలుతున్న దృశ్యం.

—ఒకే కత్తిదెబ్బకు వధ్యశిలమీది ఎన్నో తలలు ఎగిరిపడ్డ దృశ్యం.

—దోసిలి ఆసరాతో నవ్వుతున్న పువ్వుల్ని - దోసిలే ఉచ్చు బిగించి రెండు చేతుల మధ్య పువ్వుల్ని నలిపి పారేసిన దృశ్యం.

—సజీవంగా జ్వలిస్తున్న సిగరెట్ పీకను, ఏదో బూటుకాలు కసికొద్ది తొక్కి చంపిన దృశ్యం.

అడుగుల ప్రవాహం చిన్నాభిన్నమైంది. పరిగెడుతూ పరిగెడుతూ కూలబడుతున్న శరీరాలు. తెగించి ముందుకే పోతున్న శరీరాలు. ప్రాణాల తీపితో వెనక్కి తిరిగొచ్చి, మళ్ళీ అదే పాత గానుగ నడకనడుస్తున్న ముసలి వాళ్లూ, ముతక వాళ్లూ, రక్తం చచ్చిన యువకులు, విషయమేదో తెలియని అమాయకపిల్లలు.

మళ్ళీ అడుగులు....అడుగులు....

ఒకరి అడుగుల్లో మరొకరి అడుగులు. ముందు పాదం లేచిన చోటే వెనకపాదం. వెనకపాదం లేచిన చోటే ఆ వెనక పాదం....

* * *

స్వేచ్ఛ కోసం ముందుకు పరుగెడుతున్న కొన్ని అడుగులు క్రమంగా బలం పుంజుకున్నాయి. ఊర్లూ, వాగులూ వొర్రెలూ అడవులూదాటి అదృశ్యమైనాయి. వేట ప్రారంభించడానికి, సరైన సమయం కోసం నరాలు బిగబట్టుకున్నాయి.

—కొన్ని చేతులు....కూల్చాల్సిన కొన్ని పునాదుల్లో బాంబులు పెడుతున్న దృశ్యం.

—ఎండిన ఆకుల చప్పుడు కూడా కాకుండా, అతి జాగ్రత్తగా అడవిలో మసలుతున్న వేటగాడి దృశ్యం.

—మెల్లగా చెట్టుదిగి, నిశ్శబ్దంగా వెనకనుండి మీదపడి ప్రాణాలు పీల్చే చిరుత పులుల్ని, అప్రమత్తతతో గమనించి తుపాకుల్తో కాల్చివేస్తున్న దృశ్యం.

—సమాజం నిండా నిశ్శబ్దంగా, అదృశ్యంగా పాకే విష సర్పాల్ని, మాంసంముద్ద లనిపించే ఎర్ర దస్తీల జెండాలను ఎర చూయించి పట్టుకొంటున్న దృశ్యం.

—శుభ్రమైన గాజు పాత్రలో దవడలు నొక్కి పట్టుకోబడిన పాము, విషాన్ని కార్చుకుంటున్న దృశ్యం.

—పక్షులన్నీ కలిసి గింజలేరుకు తింటున్న దృశ్యం.

—పొలంలో రైతు మందు చల్లుతున్న దృశ్యం.

—స్విచ్ వేస్తేనే చీకటి పగిలిపోయిన దృశ్యం.

—కిక్ కొడితేనే ఇంజన్ స్టార్టవుతున్న దృశ్యం.

—రోగి నాళాల్లోకి గ్లూకోస్ చుక్కలు జారుతున్న దృశ్యం.

—పక్షులన్నీ కలిసి వల ఎగరేసుకు పోతున్న దృశ్యం.

—నాగలికర్రు కసుక్కున దిగి, రాళ్లూ రప్పలూ పెకిలిస్తున్న దృశ్యం.

—కొలిమిలో ఎర్రగా కాలిన ఇనుపముక్కను స్తుతి దెబ్బలు సాగదీస్తున్న దృశ్యం.

—దారిలో ఏర్పడ్డ భూమిపుండు నిండా గుట్టలు కొట్టిపోసి, కంకర రాళ్ళతో గట్టిగా రోడ్డు వేస్తున్న దృశ్యం.

—ఒక చేయి నొసలు తుడిచి చిట్లించిన చెమట- బిందువుగా మట్టిలో కలిసి, వీచిన సువాసనని అనుభవించిన ఒక ప్రశాంతమైన తృప్తి.....కొన్ని ముఖాలమీదుగా కదిలిన దృశ్యం........

—రోడ్డు వేయబడుతోంది. ఆ రోడ్డు అక్కడి నుండి ఊరి నడిబొడ్డు దాకా వేయబడుతోంది. గానుగ నడక నుండి, బానిసత్వం నుండి జనం బయటపడడాని కోసం, అందరికోసం కొందరిచేత వేయ బడుతోంది.

—సమంగా చేయడానికి కంకర రాళ్ళ రోడ్డును అడుగులు తొక్కుతున్న దృశ్యం.

—మార్చ్ చేస్తున్నట్లుగా, లయబద్ధంగా రాళ్ళమీద అడుగులు పడుతున్న శబ్దం.... కర్రీ, కర్రీ.... కర్రీ, కర్రీ............

అరుణతార

డిసెంబర్ 1979-మార్చ్ 1980